క్లుప్తంగా

నేడు చీమకుర్తి మండల పరిషత్ సమావేశం

చీమకుర్తి రూరల్: చీమకుర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాఘవేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. మండలస్థాయి అధికారులు వారి దగ్గరున్న ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని, జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

ఒంగోలు సబర్బన్: అర్హులైన పేదలకు సొంతింటి కల నిజం చేసుకునే అవకాశం ఇవ్వడమే ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 కార్యక్రమ లక్ష్యమని ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ కే వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికారులతో కలిసి పథకం అంగీకార్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సొంత స్థలం ఉన్నవారు, రేషన్ కార్డు కలిగిన వారికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు.

నేటి నుంచి మండల స్థాయి ఆటల పోటీలు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 18, 19 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓలు చంద్రమౌలేశ్వర్, వెంకారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18న వాలీబాల్, షటిల్ (బ్యాడ్మింటన్), చెస్, యోగా, 19న కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. పోటీలకు అండర్-14, అండర్-17 బాలబాలికలు అర్హులని ఎస్‌జీఎఫ్ మండల కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు తెలిపారు. వివరాలకు 7989440879 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

120 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడు మండలం రుద్రవరం గ్రామంలో మాజీ ఎంపీపీ కూకట్ల కోటయ్య ఫౌండేషన్ పర్యవేక్షణలో విజయవాడ హెల్ప్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 120 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సంతనూతలపాడు సింగిల్ విండో సొసైటీ చైర్మన్ కూకట్ల విజయమ్మ, రుద్రవరం గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ కూకట్ల శరత్‌బాబు, గ్రామ నాయకులు మల్లికార్జున, సింహ, హెల్ప్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై తహసీల్దార్ పరిశీలన

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడు మండలంలోని పేర్నమిట్ట పరిధిలో గల లింగారెడ్డికాలనీ, ఇందిరా నగర్ సమీపంలో స్థానిక చెన్నకేశవ, రంగనాథస్వామి ఆలయాలకు సంబంధించి భూముల ఆక్రమణలపై బుధవారం సాయంత్రం సంతనూతలపాడు తహసీల్దార్ నారాయణరెడ్డి, మండల సర్వేయర్ రాజేష్‌తో కూడిన రెవెన్యూ బృందం పరిశీలించింది. ఎండోమెంట్ ఈవో ప్రసన్నలక్ష్మి ఫిర్యాదు మేరకు దేవస్థానం భూమి ఆక్రమణపై రెవెన్యూ బృందం పరిశీలించి కొంత భూమి ఆక్రమణకు గురైనట్టు ప్రాథమికంగా గుర్తించారు. త్వరలో సర్వే చేసి ఆక్రమణలు తొలగించనున్నట్లు తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. ఎండోమెంట్ ఈవో ప్రసన్నలక్ష్మి, వీఆర్వో జాలయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కీచక టీచర్లపై జేసీతో విచారణ నిర్వహించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నీలం నాగేంద్రరావు

ఒంగోలు వన్‌టౌన్: విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన టీచర్లపై జేసీతో విచారణ నిర్వహించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు బుధవారం కలెక్టర్ పి.రాజబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. నిందితుల్లో ఊళ్లపాలెం వ్యాయామ ఉపాధ్యాయుడు పిల్లి హజరత్తయ్యను కలెక్టర్ సస్పెండ్ చేశారని, మిగిలిన చిరుమామిళ్ల మాధవరావు, ఉలిచి సుబ్బారెడ్డిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. ఈ కేసును సింగరాయకొండ ఎస్సై ఫాల్స్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వానొస్తే వరదే..!

- వర్షం కురిస్తే జలమయమవుతున్న రహదారులు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



పెదకొత్తపల్లి ఎస్సీకాలనీలో వర్షానికి రోడ్లపై నిలిచిన నీరు



సంతనూతలపాడులోని ప్రధాన రహదారి దుస్థితి

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్):

సంతనూతలపాడులోని పశువుల ఆస్పత్రి సమీపంలో పలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రధాన రహదారి చిన్నపాటి వర్షానికే చెరువును తలపిస్తోంది. దీంతో స్థానిక ప్రజలు అటువైపు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షం పడితే రహదారి మొత్తం నీరు నిలిచి మాగాణిలా మారిపోతోంది. ఈ రహదారికి మోక్షం ఎప్పుడు కలుగుతుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ ప్రాంతంలో హైస్కూలు, పశువుల హాస్పిటల్, విద్యుత్ కార్యాలయం, మండల పరిషత్, ఎస్‌ఎస్పీ కార్యాలయాలు, ప్రభుత్వ హాస్పిటల్, వెలుగు, ఎన్‌ఆర్‌ఈజీఎస్, వ్యవసాయ శాఖ కార్యాలయాలు ఉన్నాయి. ఇక, కామేపల్లివారిపాలెం, మంగమూరు, స్థానిక క్రిస్టియన్పాలెం, ఎన్‌ఎస్పీ కాలనీ, తదితర ప్రాంతాల ప్రజలంతా ప్రధాన రహదారి మీదుగానే రాకపోకలు సాగించాల్సి ఉంది. ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు నీటిలో నుంచే వెళ్లాల్సి వస్తుండటంతో అవస్థపడుతున్నారు. వర్షం పడితే ఈ రహదారి చిత్తడిగా మారుతోంది. కొణిజేడుడొంక రెండు వైపులా గృహాలను నిర్మించుకున్నారు. అయితే సైడు కాలవలు లేక మురికి నీటిని రహదారివైపే మళ్లిస్తున్నారు. ఈ ప్రధాన రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించి టెండర్లు పిలిచారే గానీ.. నేటికీ మోక్షం కలగలేదు. సంతనూతలపాడులోని ప్రధాన రహదారి వర్షం నీటితో మురికికూపంగా మారడంతో ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారిలోని గృహాల వారి పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. వర్షం కురిస్తే ఈ రహదారిలో ప్రయాణం మరింత ఇబ్బందికరంగా ఉంది. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సంతనూతలపాడులోని ప్రధాన రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుని ప్రజల ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

కొద్దిపాటి వర్షానికే ముద్దవుతున్న కాలనీలు...

మద్దిపాడు: సైడు కాలువలు లేకపోవడంతో వర్షం నీరు సక్రమంగా బయటకు వెళ్లే దారిలేక మద్దిపాడు మండలంలోని నాగన్నపాలెం, పెదకొత్తపల్లి ఎస్సీకాలనీలు బుధవారం ఉదయం కురిసిన వర్షానికి తడిసిముద్దయ్యాయి. ఆయా కాలనీల్లోని రోడ్లపై నీరు చేరి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. కాలనీలో చిన్నపాటి వర్షానికి సైతం నీరు నిలిచిపోతోందని, అధికారులు పట్టించుకోవడంలేదని వారు వాపోతున్నారు. నీరు రెండుమూడు రోజుల పాటు కాలనీలో నిలిచి దోమలు పెరిగిపోతున్నాయని, జ్వరాలు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వారు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం వస్తే నీటిలోనే ఉండాల్సి వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తునారు. తమ కాలనీలో నీరు బయటకు పంపడానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, దీంతో తాము నీళ్లలోనే తిరగాల్సి వస్తోందని వారు తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



నాగన్నపాలెం ఎస్సీకాలనీలో పాఠశాలకు వెళ్లే దారిలో నిలిచిన వర్షం నీరు

ఘనంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జేసీ, డీఆర్‌ఓ



జిల్లా పోలీసు కార్యాలయంలో విశ్వకర్మ జయంతి నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

ఒంగోలు సబర్బన్: విశ్వకర్మ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలు కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో విశ్వకర్మ చిత్రపటానికి జేసీ గోపాలకృష్ణ పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. డీఆర్వో బి.చినఓబులేసు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

చేతివృత్తులను గౌరవించడమే విశ్వకర్మకు నివాళి...

ఒంగోలు టౌన్: చేతివృత్తులను, శ్రామిక జీవన సౌందర్యాన్ని గౌరవించడమే విశ్వకర్మకు నిజమైన నివాళి అని ఏఆర్ ఏఎస్పీ కొల్లూరు శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసిన పోలీసు అధికారులు నివాళులర్పించారు. ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, ఏఆర్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ జయంతి...

ఒంగోలు మెట్రో: స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన విశ్వకర్మ జయంతి వేడుకల్లో విశ్వకర్మ రాష్ట్ర కార్యదర్శి కుమారి కొత్తపల్లి సోని పాల్గొని విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జూనియర్ అసిస్టెంట్ పూలమాలలు వేశారు. సంపూర్ణ కాళహస్తి ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో...

బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఓల్డ్ గవర్నమెంట్ హాస్పిటల్ వెనుక గల బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో విశ్వకర్మ జయంతి నిర్వహించారు. జేసీ గోపాలకృష్ణ, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి నిర్మల జ్యోతి, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఏలూరి కోటేశ్వరరావు, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు బాబు, అదిమూలం సుబ్బారావు, పులివర్తి అజయ్, కీనల శ్రీనివాసాచారి, రావుల లక్ష్మయ్య, విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి ఏలూరి పూర్ణచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి: విశ్వకర్మ భగవాన్ జయంతి సందర్భంగా బుధవారం చీమకుర్తిలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో హోమాలు నిర్వహించారు. విశ్వబ్రాహ్మణుల సంఘ నాయకులు మల్లికార్జున, వీరబ్రహ్మం, నాగబ్రహ్మం, దుర్గాప్రసాద్, స్థానికులు పాల్గొన్నారు.



జిల్లా గ్రంథాలయంలో విశ్వకర్మ జయంతి వేడుకల్లో పాల్గొన్న సిబ్బంది



చీమకుర్తిలో హోమాలు నిర్వహిస్తున్న భక్తులు

అమరావతికి మెగా డీఎస్సీ అభ్యర్థులు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

ఒంగోలు వన్‌టౌన్: మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులను అమరావతి తరలించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పి.రాజబాబు తెలిపారు. డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 19న నియామక పత్రాలు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు తీసుకువెళ్తున్న అభ్యర్థుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో మాట్లాడారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి ఎంపికైన 661 మంది అభ్యర్థులను జోనల్ స్థాయిలో ఎంపికైన ప్రిన్సిపాళ్లు, పీజీటీలు, టీజీటీలు, 188 మందిని అమరావతి తరలించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఒంగోలు నగరంలోని సెయింట్ జేవియర్స్ హైస్కూల్, ఆగ్జిలియం హైస్కూల్, మంగమూరు డొంకలోని రామచంద్ర మిషన్, వెంగముక్కలపాలెంలోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలకు అభ్యర్థులను ఈ నెల 18వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 19వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 38 బస్సులలో అమరావతి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ గోపాలకృష్ణ, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జి.సత్యనారాయణ, డీఈఓ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

75 మంది రక్తదానం



లా కళాశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి



ఎస్ఎస్ఎన్ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఏకేయూ వీసీ డి.వి.ఆర్.మూర్తి

ఒంగోలు సిటీ: దేశ ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని లా కళాశాలలో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. క్విస్ విద్యాసంస్థలు, పేస్ ఇంజినీరింగ్ కళాశాల, ఇందిరా ప్రియదర్శిని లా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించగా, 75 మంది విద్యార్థులు, బీజేపీ కార్యకర్తలు, మోదీ అభిమానులు పాల్గొని రక్తదానం చేశారు. క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, నర్సింగరావు ముఖ్య అతిథులుగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించగా, ఇందిరా ప్రియదర్శిని లా కళాశాల సెక్రటరీ సీవీ రామకృష్ణ, సెగ్గం శ్రీనివాసరావు, శివారెడ్డి, మాకినేని అమరసింహం, పువ్వాడ దామోదర్, రాయపాటి అజయ్, ఆశారావు, విజయరావు, జె.రమాదేవి, యోగయ్య యాదవ్, శివాజీ యాదవ్, గరికపాటి వంశీకష్ణ, నాయక్, రాజేశ్‌వర్మ, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి వికసిత భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను ఒంగోలులోని ఉమా మనోవికాస కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామనోవికాస కేంద్రానికి ఓవర్‌హెడ్ ట్యాంకు బహూకరించి విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ మోదీ జన్మదిన వేడుకలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఎస్ఎస్ఎన్ కళాశాలలో...

ఒంగోలు సిటీ: స్థానిక మంగమూరు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో రక్తదాన అమృత మహోత్సవ్ 2.0 కార్యక్రమాన్ని నవ్య బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో బుధవారం నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ వై.సత్యనారాయణరెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా ఏకేయూ వీసీ డి.వి.ఆర్.మూర్తి పాల్గొని మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ హర్షప్రీతమ్, ఎన్ఎస్ఎస్ అధికారులు రాజేంద్రబాబు, నీలిమ, రవితేజ, నిరూషా, అధ్యాపకులు జోసఫ్, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ సవరణ చట్టాన్ని ఉపసంహరించాలి

ఒంగోలు టౌన్: కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ఆర్థిక బిల్లుతో ప్రవేశపెట్టిన పెన్షన్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జి.శేషయ్య, సీహెచ్ రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని కలిసి ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. సుదీర్ఘకాలం ప్రభుత్వ రంగంలో సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లకు పెన్షన్ పెంపు, డీఏ పెంపులు చేయకపోగా నష్టదాయకమైన సవరణ చట్టం ప్రవేశపెట్టడం అన్యాయమన్నారు. ఈ ఏడాది మార్చి 25వ తేద కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ రూల్స్‌కు అతి ప్రమాదకరమైన, తీవ్ర నష్టదాయకమైన సవరణలను లోక్‌సభలో పాస్ చేయించినట్లు తెలిపారు. మార్చి 29న ఆర్థిక బిల్లుతో పాటు ఈ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం కూడా తెలిపారని వివరించారు. ఈ బిల్లును నేరుగా లోక్‌సభలో ప్రవేశపెడితే వ్యతిరేకత వ్యక్తమవుతుందన్న భయంతో దొడ్డిదారిన ఆర్థిక బిల్లులో చొప్పించి పాస్ చేయించుకున్నారని ఆరోపించారు. దీనివలన సీనియర్ పెన్షనర్లు ఎలాంటి ఆప్షన్ లేకుండా గడపాల్సి వస్తోందని తెలిపారు. మోదీ పాలన కాకులను కొట్టి గద్దలకు వేసిన చందంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ఇబ్బందులను పార్లమెంటులో లేవనెత్తాలని ఎంపీని పెన్షనర్లు కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై తమిళనాడు బృందం పర్యటన



ప్రకృతి వ్యవసాయ పైరును పరిశీలిస్తున్న తమిళనాడు బృందం

కొత్తపట్నం: తమిళనాడు రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్‌కు చెందిన 33 మంది సభ్యుల బృందం ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం కొత్తపట్నం మండలంలో పర్యటించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సాధికార సంస్థ అమలు చేస్తున్న ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం కార్యక్రమాలను పరిశీలించింది. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి ఆధ్వర్యంలో రెండు గ్రూపులుగా విడిపోయి కొత్తపట్నం మండలంలోని పలు గ్రామాలను సందర్శించారు. మొదటి బృందం రంగాయపాలెం గ్రామంలో ఆరోగ్య పోషణ విభాగ కార్యక్రమాలను పరిశీలించింది. రెండో బృందం ఈతముక్కల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ కార్యక్రమాలను పరిశీలించింది. కొత్తపట్నం గ్రామంలో మల్లేశ్వరి బయో రిసోర్స్ సెంటర్‌లో విత్తన గుళికలు ఘన, ద్రవ జీవామృతం తయారీపై ప్రదర్శనలు నిర్వహించారు. స్వయం సహాయక బృందాల మహిళలతో బృంద సభ్యులు చర్చలు జరిపారు. తమిళనాడు బృందం వెంట ఆర్‌వైఎస్ఎస్ స్టేట్ ఆఫీస్ నుంచి హుమయూన్, కృష్ణారావు, దాదా పీర్ శ్రీలేఖ, జిల్లా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు బాలుడు మృతి.?

ఒంగోలు టౌన్: నగర శివారులోని గాంధీనగర్లో బుధవారం ఉదయం పిడుగు పాటుకు కంకణాల చందు అనే పదేళ్ల బాలుడు మృతిచెందినట్లు సమాచారం. ఉదయం గంట పాటు భారీ వర్షం కురిసింది. అదే సమయంలో పెద్ద శబ్దంతో పిడుగు పడింది. ఆ శబ్దానికి బాలుడు మృతి చెందినట్లు తెలుస్తోంది. తల్లిదండ్రుల ఎదుటే ఆ బాలుడు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. ఇదిలా ఉండగా, తమ కుమారుడు పిడుగు పాటుకు మరణించినట్లు అతని తల్లిదండ్రులు నిర్ధారించలేదు. పోలీసులు కేసు నమోదు చేయబోగా నిరాకరించినట్లు సమాచారం.

కలెక్టర్‌ను అభినందించిన ఏపీజీఈఏ నేతలు



కలెక్టర్‌ను కలిసి అభినందిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నాయకులు



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎన్‌జీఓ నాయకులు

ఒంగోలు సబర్బన్/ఒంగోలు వన్‌టౌన్: నూతన కలెక్టర్ పీ రాజాబాబును ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) నాయకులు బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిశారు. అదేవిధంగా జిల్లా ఎన్‌జీఓ అసోసియేషన్ నాయకులు కూడా కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు కె.శరత్‌బాబు, జిల్లా కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి, కోశాధికారి కె.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెరియార్ ఆశయాలు అభినందనీయం



పెరియార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాలు

చీమకుర్తి: ద్రవిడ పితామహుడు పెరియార్ జీవిత ఆశయాలు అభినందనీయమని పలువురు ప్రజా సంఘాల నాయకులు కొనియాడారు. పెరియార్ జయంతి సందర్భంగా బుధవారం చీమకుర్తిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంటరానితనం నిర్మూలనలో పెరియార్ సేవలను గుర్తు చేసుకున్నారు. నివాళులర్పించిన వారిలో కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుడ్డు వెంకట్రావు, పేరం శ్రీనివాసరావు, ఇస్తర్ల శంకర్, చింతలపాలెం బాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నగరంలో స్వచ్ఛతా హి సేవా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్, అధికారులు, సిబ్బంది

ఒంగోలు వన్‌టౌన్: స్వచ్ఛతా హి సేవా-2025 కార్యక్రమంలో భాగంగా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నుంచి నిర్వహించిన ర్యాలీ అనంతరం నగర పాలక సంస్థ కౌన్సిల్ హాలులో స్వయం సహాయక గ్రూపులతో సమావేశం ఏర్పాటు చేసి కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ ప్రతిరోజూ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, శానిటరీ సూపర్‌వైజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

20న అక్కినేని నాగేశ్వరరావు జయంతి

ఒంగోలు మెట్రో: నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు జయంతి వేడుకలను ఈ నెల 20వ తేదీ ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సంబంధిత బ్రోచర్‌ను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అక్కినేని కళాపరిషత్ అధ్యక్షుడు కల్లగుంట కృష్ణయ్య మాట్లాడుతూ ఒంగోలు సీవీఎన్ రీడింగ్ రూమ్ ఆవరణలో 20వ తేదీ సాయంత్రం ఆరు గంటల నుంచి అక్కినేని నాగేశ్వరరావు జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఒంగోలు డివిజన్
90102 24456, 90103 57744
90102 02762
Office mail : sakshiongads@gmail.com